
జెండా వందనం చేస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్





రాష్ట్ర హక్కుల కోసం పోరాటం

● పంద్రాగస్టు సభలో స్టాలిన్ ● సమరయోధులు, మాజీ సైనికులు, కార్మికులకు సీఎం వరాలు

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కొన్ని చట్టాలు, కోర్టు నిర్ణయాల వల్ల, నిధుల పంపిణీలో పక్షపాతం ఏర్పడి, వాటివల్ల రాష్ట్ర ప్రభుత్వాలు ప్రతి దానికి కేంద్రప్రభుత్వంపై ఆధారపడవలసి వస్తోందని, దీనిని అధిగమించేందుకు, రాష్ట్ర హక్కులను పునరుద్ధరించడానికి రాజకీయ చట్టపరమైన చర్యలు తీసుకోవటమే ఏకైక పరిష్కారమని ముఖ్యమంత్రి ఎంకే స్టాలిన్ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ చర్యలు చేపట్టడానికి సరైన సమయం ఆసన్నమైందని తాను భావిస్తున్నానన్నారు సెయింట్ జార్జ్‌కోటలో శుక్రవారం ఉదయం సీఎం స్వాతంత్ర్య దిన వేడుకలో త్రివిధ దళాల కవాతు తిలకించి, పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరించారు. ఆ తర్వాత సెయింట్ జార్జి కోట బురుజుపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించి జాతినుద్దేశించి ప్రసంగించారు. స్వాతంత్ర్య దినోత్సవంలో ముఖ్యమంత్రులు జాతీయ పతాకాన్ని ఆవిష్కరించే హక్కును మాజీ ముఖ్యమంత్రి కరుణానిధి పోరాడి సాధించారనే విషయాన్ని ఈ సందర్భంగా అందరూ గుర్తుంచుకోవాలన్నారు. రాష్ట్ర స్వావలంబన, రాష్ట్రాల హక్కుల కోసం దశాబ్దాల తరబడి పోరాడుతున్నది డీఎంకే మాత్రమేనని చెప్పారు. కేంద్రం నుంచి రాష్ట్రానికి రావాల్సిన, చెల్లించాల్సిన నిధుల కోసం పోరాటాలు చేయడం, న్యాయస్థానాలను ఆశ్రయించడం ఫెడరల్ రాజ్యాంగానికి మంచిది కాదన్నారు. ఇది రాష్ట్రాభివృద్ధిని దెబ్బతీయటమే కాక దేశ పురోభివృద్ధిని కూడా ప్రభావితం చేస్తుందన్నారు. స్వావలంబన, ప్రత్యేకమైన గుర్తింపుతో ప్రతి రాష్ట్రం పురోభివృద్ధి సాధించినప్పుడే పటిష్టమైన భారతం ప్రపంచ వేదికపై సగర్వంగా నిలబడగలుగుతుందని స్టాలిన్ పేర్కొన్నారు. గత నాలుగేళ్లలో ద్రావిడ తరహా పాలనలో సమరయోదులను స్మరించుకుంటూనే ప్రజలను, రాష్ట్రాన్ని పురోగమన దిశగా నడిపించే ప్రభుత్వంగా పేరు తెచ్చుకుంద న్నారు. 14 యేళ్ల తర్వాత ద్రావిడ తరహా పాలనలో రాష్ట్ర ఆర్థిక వృద్ధి 11.19 శాతానికి పెరిగిందన్నారు. దేశ ఆర్థికవృద్ధి 6.5 శాతం కాగా, రాష్ట్ర ఆర్థిక వృద్ధి 11.19 శాతం మేరకు సాధించడానికి డీఎంకేపై నమ్మకంతో అధికారాన్ని అప్పగించిన రాష్ట్ర ప్రజలే కారణమని స్టాలిన్ స్పష్టం చేశారు.

నిధుల పంపిణీలో తగ్గిన వాటా...

విభిన్న రాష్ట్రాలు, విభిన్న సంస్కృతులు, అనేక భాషలు, అనేక మతాలకు చెందిన కోట్లాదిమంది పౌరులతో కూడిన ఉపఖండమే భారతదేశమని, అన్ని తేడాలను అధిగమించి భారతీయులంతా సమైక్యంగా జీవించడానికి కారణం రాజ్యాంగమేనని సీఎం పేర్కొన్నారు. డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ రూపొందించిన ఈ చారిత్రాత్మకమైన శాసనంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయడానికి అవసరమైన అధికార విభజన స్పష్టంగా నిర్వచించారని తెలిపారు. గత కొన్నేళ్లుగా వివిధ రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించడానికి కేంద్ర ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను దేశ ప్రజలంతా గమనిస్తూనే ఉన్నారని, ప్రజల కోరిక నెరవేర్చేందుకు, ప్రజలకు చేరువగా అత్యంత సన్నిహితంగా పనిచేసే రాష్ట్ర ప్రభుత్వాలకు మరిన్ని అధికారాలను కల్పించాల్సిన కేంద్ర ప్రభుత్వం విద్య, ఆరోగ్య సంరక్షణ వంటి కీలకమైన రంగాల్లో రాష్ట్ర ప్రభుత్వాల హక్కులను హరించి వేస్తున్నదని ఆరోపించారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలను భావితరాలు తెలుసుకునేలా వారి విగ్రహాలు, మణి మండపాలు నిర్మించి సమరయోధుల కీర్తిని వ్యాపింపజేసింది డీఎంకే ప్రభుత్వమేనని గుర్తు చేశారు ఈ యేడాది సమరయోధులకు, వారసులకు, మాజీ సైనికులకు, కార్మికులకు స్టాలిన్ 9 వరాలు ప్రకటించారు.

స్టాలిన్ వరాలు

- రాష్ట్రంలో సమరయోధుల పింఛన్ రూ.22 వేలకు పెంపు
- సమరయోధుల కుటుంబ పింఛన్ రూ.12 వేలకు పెంపు
- వీరపాండ్యకట్ట బ్రహ్మన వారసులకు, రామనాథపురం మాజీ సంస్థానాధీశులు విజయ రఘునాథసేతుపతి వారసులకు, శివగంగ మరుదు సోదరుల వారసులు, వా.వి. చిదంబరనార్ వారసులకు ప్రతినెలా ఇచ్చే పింఛన్ రూ.11 వేలకు పెంపు
- రెండో ప్రపంచ యుద్ధంలో పాల్గొన్న రాష్ట్రానికి చెందిన మాజీ సైనికులకు ప్రతి నెలా చెల్లించే ఆర్థిక సహాయం రూ.15 వేలకు పెంపు, అమరులైన మాజీ సైనికుల కుటుంబ పింఛన్ రూ.8 వేలకు పెంపు
- రాష్ట్రానికి చెందిన మాజీ సైనికుల కోసం మాధవరంలో సకల సదుపాయాలతో రూ 22 కోట్లతో వసతి గృహ సముదాయం.
- రాష్ట్రంలోని గిరిజన ప్రాంతంలో అమలు చేస్తున్న ఛార్జీ లేని వెలుగుబాట ప్రయాణ పథకాన్ని దివ్యాంగులకు వర్తింపు.
- డ్రైవింగ్ శిక్షణ కోసం రాష్ట్ర స్థాయిలో ఓ కేంద్రం, జోన్ల స్థాయిలో రెండు శిక్షణా కేంద్రాలు, జిల్లాకు ఒక డ్రైవింగ్ శిక్షణ కేంద్రం చొప్పున ఏర్పాటు
- రాష్ట్రంలోని భవన కార్మికుల సంక్షేమ సంస్థలో పేర్లు రిజిస్టర్ చేసుకున్న కార్మికుల పిల్లలు కళాశాలల్లో చదివే వారికి ప్రతిభాపాటవాల పెంపుకోసం రూ.15 కోట్లతో ఆన్‌లైన్ ద్వారా శిక్షణ.

సేవా నిరతులకు పురస్కారాలు

● ప్రొఫెసర్ ఖాదర్‌మొహిద్దీన్‌కు తగసాలై తమిళర్ అవార్డు ● తులసిమది మురుగేశన్‌కు కల్పనాచావ్లా అవార్డు


సీఎం స్టాలిన్ చేతుల మీదుగా అవార్డులు అందుకున్న అధికారులు, సేవా పరులు, సేవా సంస్థల ప్రతినిధులు

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక సెయింట్ జార్జి కోట వద్ద అట్టహాసంగా జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో వివిధ రంగాల్లో విశిష్ట సేవలందించిన ప్రముఖులకు సీఎం స్టాలిన్ అవార్డులు ప్రదానం చేశారు. ఇండియన్ యూనియన్ ముస్లింలీగ్ జాతీయ అధ్యక్షుడు, ప్రొఫెసర్ కేఎం ఖాదర్‌మొహిద్దీన్‌కు 'తగైసాల్ తమిళర్ అవార్డును, భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ చైర్మన్ నారాయణన్‌కు డాక్టర్ ఏపీజేఅబ్దుల్‌కలామ్ అవార్డును, కాంచీపురం జిల్లాకు చెందిన దివ్యాంగురాలైన బ్యాడ్మింటన్ క్రీడాకారిణి తులసిమది మురుగేశన్‌కు కల్పనాచావ్లా అవార్డు ప్రదానం చేశారు. సెయింట్ జార్జికోట బురుజుపై జాతీయ పతాకాన్ని ఆవిష్కరించిన తర్వాత సీఎం స్టాలిన్ తొలుత ఖాదర్‌మొహిద్దీన్‌కు తగసాల్ తమిళర్ అవార్డు కింద ఆయనకు రూ.10లక్షల నగదు, ప్రశంసాపత్రాన్ని అందజేశారు. ముస్లింలీగ్ నేత ప్రొఫెసర్ ఖాదర్ మొహిద్దీన్ తిరుచ్చి జమాల్ మహమ్మద్ కళాశాలలో 15 యేళ్లపాటు హిస్టరీ ప్రొఫెసర్‌గా పనిచేశారు. 'మణిచుడర్' పత్రిక సంపాదకుడిగా ఉన్నారు. 2004లో వేలూరు ఎంపీగా ఎంపికయ్యారు.

కల్పనాచావ్లా అవార్డు...

కాంచీపురం జిల్లాకు చెందిన తులసిమది మురుగేశన్ పుట్టినప్పుడే కండరాల బలహీనత కారణంగా ఎడమ చేయి పనిచేయకపోయినా తానెంచుకున్న బ్యాడ్మింటన్ క్రీడలో రాణిస్తున్నారు. వైకల్యాన్ని అధిగమించి సాహసోపేతంగా అటు చదువులోనూ, ఇటు క్రీడల్లో మేటిగా ఉంటున్నారు. ప్రస్తుతం ఈమె నామక్కల్ ప్రభుత్వ వెటర్నరీ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్‌లో నాలుగో సంవత్సరం చదువుతోంది. వివిధ దేశాలలో జరిగిన బ్యాడ్మింటన్ పోటీల్లో ఆమె 22 స్వర్ణ పతకాలు సహా మొత్తం 40 పతకాలను గెలుచుకుంది. ప్యారీస్‌లో జరిగిన పారాలంపిక్స్‌లో రజతపతకాన్ని గెలుచుకుంది. వైకల్యాన్ని అధిగమించి మేటి బ్యాడ్మింటన్ క్రీడాకారిణిగా రాణిస్తున్న తులసిమది మురుగేశన్‌కు ప్రతిష్టాత్మకమైన కల్పనాచావ్లా అవార్డును ముఖ్యమంత్రి స్టాలిన్ అందజేశారు.

సేవాపరులు, సేవా సంస్థలకు అవార్డులు..

ఇదే విధంగా గ్రామీణాభివృద్ధి పథకాలతో సమాజంలో మార్పులు తెచ్చినందుకుగాను ముఖ్యమంత్రి పేరుతో పాలనాసామర్థ్య అవార్డును ఐపీఎస్ అధికారి డాక్టర్ ప్రసన్నకుమార్, తహసీల్దార్ పి.బాలకృష్ణన్, బీడీఓ వి.యమున సంయుక్తంగా అందుకున్నారు. నిర్మాణాల ప్లాన్ సులభతరం చేసినందుకుగాను గృహవసతి, శివారు ప్రాంతాల అభివృద్ధి శాఖ అదనపు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కాకర్లఉషా, పి.గణేషన్‌కు, ఆదిద్రావిడ శాఖ కార్యదర్శి లక్ష్మీ ప్రియ, ఆదిద్రావిడ సంక్షేమ విభాగం కమిసనర్ డి.ఆనంద్, గిరిజన సంక్షేమ సంస్థ డైరెక్టర్ ఎస్.అన్నాదురై, ఆదిద్రావిడ గృహనిర్మాణ సంస్థ ఎండీ కేఎస్ కందసామి అవార్డులు అందుకున్నారు. కన్నియాకుమారిలో తిరువళ్లువర్ విగ్రహం - వివేకానంద స్మారక మండపం మధ్య అద్దాల వంతెన నిర్మాణంలో కీలక పాత్ర వహించిన హైవేస్, మినీ ఓడరేవుల శాఖ ప్రభుత్వ కార్యదర్శి డాక్టర్ ఇరా సెల్వరాజ్, ప్రపంచ వ్యాప్తంగా తమిళభాషాభివృద్ధికి పాటుపడిన తమిళ అంతర్జాల విద్యావిభాగం డిప్యూటీ డైరెక్టర్ ఆర్.కోమగన్, దివ్యాంగుల సంక్షేమానికి విశిష్టసేవలందించినందుకు తిరుచ్చి డాక్టర్ కుమరవేల్ షణ్ముగసుందరంకు, సేలం జిల్లాకు చెందిన ఎక్కమ్‌వెల్ దివ్యాంగుల పునరావాస కేంద్రానికి, కోవై జిల్లాకు చెందిన గుణశేఖరన్ జగదీశన్, అధిక సంఖ్యలో దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు కల్పించిన సంస్థ విరుదునగర్ జిల్లాకు చెందిన బెల్ ప్రింటర్స్ ప్రైవేట్ లిమిటెడ్ నిర్వాహకులతో పాటు పలు సంస్థల ప్రతినిధులకు స్టాలిన్ అవార్డులు అందజేశారు.

అందరికీ ధన్యవాదాలు

● రజనీకాంత్ ట్వీట్



అడయార్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): సినీ పరిశ్రమలో తన 50 ఏళ్ల ప్రయాణానికి అభినందనలు తెలిపిన ప్రతి ఒక్కరికీ సూపర్‌స్టార్ రజనీకాంత్ ధన్యవాదాలు తెలిపారు. దీరిపై ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 'ప్రతి ఒక్కరికీ 79వ స్వాతంత్ర్య దినోత్సవ శుభాకాంక్షలు. అలాగే, నా 50 యేళ్ల సినీ ప్రయాణాన్ని అభినందించిన ముఖ్యమంత్రి స్టాలిన్, ఉప ముఖ్యమంత్రి ఉదయనిధి, మాజీ ముఖ్యమంత్రి ఎడప్పాడి కె.పళనిస్వామి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, బీజేపీ నేతలు అన్నామలై, తమిళిసై, డీఎండీకే ప్రధాన కార్యదర్శి ప్రేమలత, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, సినీ నటులు కమల్ హాసన్, మమ్ముట్టి, మోహన్‌లాల్, గేయరచయిత వైరముత్తు, సంగీత దర్శకుడు ఇళయరాజా సహా తన అభిమానులు, స్నేహితులకు సూపర్‌స్టార్ హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకే ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షల రద్దు

● మంత్రి అన్బిల్ మహేష్



పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లో ఒత్తిడి తగ్గించేందుకే ప్లస్ వన్ తరగతికి పబ్లిక్ పరీక్షలు రద్దు చేసినట్లు పాఠశాల విద్యాశాఖ మంత్రి అన్బిల్ మహేష్ తెలిపారు. స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా స్కౌట్ అండ్ గైడ్స్ కార్యాలయంలో శుక్రవారం మంత్రి అన్బిల్ మహేష్ జాతీయ పతాకం ఎగురవేశారు. అనంతరం మంత్రి మీడియాతో మాట్లాడుతూ... రాష్ట్రంలో ప్లస్ టూ పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థులకు ప్లస్ వన్ తరగతి సులభంగా ఉండాలి తప్ప, వారిని ఒత్తిడికి గురిచేయరాదనే ఉద్దేశంతోనే ప్లస్ వన్ పబ్లిక్ పరీక్షలు రద్దు చేశామన్నా రు. రాష్ట్రంలో ఏడేళ్ల అనంతరం రాష్ట్ర పాఠ్య ప్రణాళికలో మార్పులు చేపట్టామని తెలిపారు. రాష్ట్రానికి చెందిన ముఖ్యమైన వ్యక్తులు, రాష్ట్ర ప్రాధాన్యత తదితరాలు పాఠ్యాంశాలుగా చేసే ప్రతిపాదన ఉందన్నారు. రాష్ట్రంలో విద్యార్థులు, విద్యపై గవర్నర్ చేసిన వ్యాఖ్యలు అంగీకరించలేమని మంత్రి తెలిపారు.

గవర్నర్ తేనీటి విందు

● డీఎంకే, మిత్రపక్షాల బహిష్కరణ



ఇటీవల జరిగిన యోగాదినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీల విజేతలకు శుక్రవారం ఎట్ హోం సందర్భంగా జ్ఞాపిక, చెక్ అందజేస్తున్న గవర్నర్ దంపతులు

పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): గవర్నర్ తేనీటి విందు కార్యక్రమంలో డీఎంకే, మిత్రపక్షాలు, టీవీకే హాజరు కాలేదు. గిండిలోని రాజ్ భవన్‌లో శుక్రవారం సాయంత్రం తేనీటి విందు నిర్వహించారు. ఇందులో అన్నాడీఎంకే తరఫున ఇన్బదురై, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్, తమిళిసై, హెచ్.రాజా, పీఎంకే అన్బుమణి వర్గం ఎమ్మెల్యేలు శివకుమార్, వెంకటేశన్, డీఎండీకే తరఫున విజయ ప్రభాకరన్, ఐజేకే వ్యవస్థాపకులు పారివేందర్, టీఎంసీ అధ్యక్షుడు జీకే వాసన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే, రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మురుగానందం, డీజీపీ శంకర్ జివాల్, గ్రేటర్ చెన్నై పోలీసు కమిషనర్ అరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమాన్ని సీఎంస్టాలిన్ సహా డీఎంకే కూటమి పార్టీలు, టీవీకే బహిష్కరించాయి.

వచ్చే ఏడాది కోటలో జెండా ఎగురవేసేది మేమే

● బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్


పార్టీ కార్యాలయంలో జెండా వందనం చేస్తున్న నయినార్ నాగేంద్రన్

ప్యారీస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఎన్డీయే కూటమి ఘనవిజయం సాధించి ప్రభుత్వం ఏర్పాటు చేస్తుందని, సెయింట్ జార్జ్‌కోటలో జాతీయ జెండా తామే ఎగురవేస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు నయినార్ నాగేంద్రన్ ధీమా వ్యక్తం చేశారు. టి.నగర్‌లోని బీజేపీ ప్రధాన కార్యాలయం కమలాలయంలో స్వాతంత్ర్య దినం సందర్భంగా నయినార్ నాగేంద్రన్ జెండా ఎగురవేసి పార్టీ నేతలతో కలిసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్రమోదీ ప్రపంచానికే ఆదర్శమన్నారు. రాష్ట్రంలో అధికారంలోవున్న డీఎంకే ప్రభుత్వాన్ని ఇంటికి సాగనంపేలా పార్టీ కార్యకర్తలంతా ప్రతిన బూనాలని, ప్రజా వ్యతిరేక ప్రభుత్వ వైఖరి గురించి ప్రచార రూపంలో ప్రజల వద్దకు తీసుకెళ్లాలని నాగేంద్రన్ పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆ పార్టీ సీనియర్ నేతలు తమిళిసై సౌందరరాజన్, కరాటే త్యాగరాజన్, కరునాగరాజన్, మహిళా సభ్యులు, కార్యకర్తలు పాల్గొని జెండా వందనం చేశారు.

మృత్యువులోనూ వీడని బంధం

● ఒకే రోజు దంపతుల మృతి

6

ఇలా గణేశన్ స్మృతిలో రాష్ట్రం

● సీఎం స్టాలిన్ సహా పలువురు నేతల సంతాపం

పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నాగాలాండ్ గవర్నర్ ఇలా గణేశన్ (80) కన్నుమూశారు. అనారోగ్యం కారణంగా అపోలో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆయన శుక్రవారం సాయంత్రం మృతిచెందారు. నగరంలోని తన ఇంట్లో ఈ నెల 8వ తేది కిందపడిన ఆయన తలకు బలమైన గాయాలయ్యాయి. వెంటనే కుటుంబ సభ్యులు అపోలో ఆస్పత్రికి తరలించగా, ఆరు రోజులుగా చికిత్స పొందుతున్న ఆయన మృతిచెందారు.


ఇలా గణేశన్ (ఫైల్‌ఫొటో)

ఇలా గణేశన్ రాజకీయ ప్రస్థానం...

తంజావూరులో లక్ష్మీరాఘవన్-అలమేలు దంపతులకు 1945 ఫిబ్రవరి 16న ఇలా గణేశన్ జన్మించారు. ఎస్ఎస్ఎల్‌సీ పూర్తిచేసిన ఆయన 2021 నుంచి 2023 వరకు మణిపూర్ గవర్నర్‌గా, అనంతరం 2023 ఫిబ్రవరి 20 నుంచి నాగాలాండ్ గవర్నర్‌గా వ్యవహరించారు. మధ్యలో 2022వ సంవత్సరంలో నాలుగు నెలలు పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా అదనపు బాధ్యతలు నిర్వహించారు. ప్రారంభంలో ఆర్ఎస్ఎస్‌లో పనిచేసిన ఆయన, ఆర్ఎస్ఎస్ ప్రచారక్‌గా మారారు. ఆర్ఎస్ఎస్ భావజాలంతో ఆయన వివాహం చేసుకోకుండా ప్రచారకుడిగా పనిచేశారు. బీజేపీ జాతీయ కార్యదర్శిగా, ఉపాధ్యక్షులుగా, రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా పనిచేశారు. 1991లో బీజేపీ కార్య నిర్వాహక కమిటీ సభ్యుడిగాను, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా వ్యవహరించారు. 2009, 2014 లోక్‌సభ ఎన్నికల్లో దక్షిణ చెన్నై నుంచి పోటీచేసి ఓటమి చవిచూశారు. అనంతరం 2016లో మధ్యప్రదేశ్ నుంచి రాజ్యసభకు ఎంపికై 2018 వరకు ఆయన రాజ్యసభ సభ్యుడిగా వ్యవహరించారు.

స్నేహభావంతో మెలిగే అరుదైన నాయకుడు: సీఎం స్టాలిన్

సిద్ధాంతపరంగా వేర్వేరు పార్టీల నాయకులతోను స్నేహభావంతో మెలిగే అరుదైన నాయకుడు. రాజకీయ నాగరికత పాటించిన మేటి రాజకీయ నాయకుల్లో ఇలా గణేశన్ ఒకరు. కరుణానిధి పట్ల ఆయన గౌరవ భావంతో మెలిగేవారు. గతంలో ఇలా గణేశన్ జన్మదిన వేడుకలకు ముఖ్యమంత్రి హోదాలో కరుణానిధి హాజరై ఆయనను అభినందించిన విషయం జ్ఞాపకం వస్తోంది. నిరాడంబరుడు, సౌమ్యుడు, అందరితోను సఖ్యతగా మెలిగే నాయకుడు ఇలా గణేశన్. తనతో కూడా స్నేహభావంతో మెలిగేవారు. ఇలా గణేశన్ నివాసంలో జరిగే అన్ని కార్యక్రమాలకు తనను కుటుంబీకులు అంతా కలసి ఆహ్వానించేవారు. ఆయన మృతితో శోకతప్తులైన కుటుంబీకులకు, రాజకీయ నాయకులకు, స్నేహితులకు ప్రగాఢ సంతాపం తెలుపుతూ సీఎం స్టాలిన్ తన సందేశంలో పేర్కొన్నారు. అలాగే, ఇలా గణేశన్ మృతికి అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి, కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుంతగై, బీజేపీ మాజీ రాష్ట్ర అధ్యక్షుడు అన్నామలై, సీనియర్ నేతలు తమిళిసై, హెచ్.రాజా, ఏఎంఎంకే ప్రధాన కార్యదర్శి టీటీవీ దినకరన్, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి ముత్తరసన్, రచయిత వైరముత్తు సహా పలు పార్టీల నేతలు వేర్వేరు ప్రకటనల్లో సంతాపం తెలిపారు.

సమాచార దృష్టి

18,19 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం

పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక పురుసైవాక్కం ప్రాంతంలో మెట్రో రైలు పనులు జరుగుతున్న నేపథ్యంలో, తాగునీటి పైపులు మార్చనున్నారు. ఈ కారణంగా రాయపురం, తిరువిక నగర్, అన్నా నగర్, తేనాంపేట, కోడంబాక్కం తదితర మండలాల పరిధిలోని పురుసైవాక్కం, పెరియమేడు, షావుకారుపేట, చింతాద్రిపేట, ఓట్టేరి, అయనావరం, పెరంబూర్, సెంబియం, కీల్పాక్కం, విల్లివాక్కం, కెల్లీస్, ట్రిప్లికేన్, టి.నగర్, సైదాపేట తదితర ప్రాంతాలకు ఈ నెల 18,19 తేదీల్లో తాగునీటి సరఫరాకు అంతరాయం కలుగనుంది. అత్యవసరాలకు https:cmwssb.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో నమోదుచేసుకుని లారీల ద్వారా తాగునీరు పొందవచ్చని మెట్రోవాటర్‌బోర్డు అధికారులు తెలిపారు.

విద్యా ఉపకారవేతనానికి దరఖాస్తుల ఆహ్వానం

పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఆదిద్రావిడ, గిరిజన, క్రైస్తవ విద్యార్థులను ప్రోత్సహించేలా పోస్ట్ మెట్రిక్, ప్రీ మెట్రిక్ సహా పలు విద్యా ఉపకారవేతనాలను ఆదిద్రావిడ సంక్షేమ శాఖ అందజేస్తోంది. ఆ ప్రకారం, ప్రస్తుత విద్యా సంవత్సరం ఉపకారవేతనం కోసం విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చు. ఇప్పటికే ఉపకారవేతనం పొందుతున్న విద్యార్థులు, రెన్యువల్ చేసుకుంటే సరిపోతుంది. మొదటి సంవత్సరం విద్యార్థులు, గత సంవత్సరం దరఖాస్తు చేసుకోలేని విద్యార్థులు, తగిన సర్టిఫికెట్లతో https://umis.tn.gov.in అనే వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని అధికారులు తెలిపారు.

ప్రభుత్వ ఐటీఐలో నేరుగా అడ్మిషన్లు

పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక గిండిలోని ప్రభుత్వ వృత్తి శిక్షణ కేంద్రం (ఐటీఐ)లో ఫొటోగ్రాఫర్, బిల్డర్, ఫుడ్ ప్రొడ్యూసర్, స్మార్ట్‌ఫోన్ టెక్నీషియన్ వంటి విభాగాల్లో శిక్షణ ఇవ్వనున్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఈ కోర్సులకు నేరుగా అడ్మిషన్ల ప్రక్రియ జరుగుతోంది. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ నెల 31వ తేదిలోగా ఐటీఐ కార్యాలయాన్ని సంప్రదించి అడ్మిషన్లు పొందవచ్చు. వివరాలకు 9499055649 అనే నెంబరు సంప్రదించవచ్చని చెన్నై జిల్లా యంత్రాంగం ఒక ప్రకటనలో తెలిపింది.

'టెట్' తేదీల్లో మార్పులు

పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ ఎంపిక బోర్డు (టీఆర్బీ) ద్వారా సెకండరీ, డిగ్రీ ఉపాధ్యాయుల పోస్టులకు నిర్వహించే 'ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) నవంబరు 1,2 తేదీల్లో నిర్వహించాల్సి ఉండగా, నవంబరు 15,16 తేదీలకు మార్చారు. కేంద్ర ప్రభుత్వ నిర్బంధ విద్యా హక్కు చట్టం కింద పాఠశాలల్లో 1 నుంచి 8వ తరగతి వరకు పనిచేసే ఉపాధ్యాయులు టెట్‌లో ఉత్తీర్ణులు కావాల్సి ఉంది. ఆ ప్రకారం, సెకండరీ గ్రేడ్ ఉపాధ్యాయులకు టెట్ పేపర్-1, డిగ్రీ ఉపాధ్యాయులకు టెట్ పేపర్-2 పరీక్షలు నిర్వహిస్తుంటారు. కాగా, క్రైస్తవులు నిర్వహించుకునే సమాధుల పండుగ రోజున టెట్ పరీక్ష నిర్వహించరాదని, ఈ పరీక్షలు వాయిదావేయాలని అన్నాడీఎంకే ప్రధాన కార్యదర్శి ఎడప్పాడి పళనిస్వామి డిమాండ్ చేయడం గమనార్హం.

18న విద్యుత్ ఉండని ప్రాంతాలు

ప్యారీస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పలు ప్రాంతాల్లో మరమ్మతుల కారణంగా 18వ తేదీ సోమవారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నారు.

పల్లావరం: పాత పల్లావరం, రాజాజీనగర్, మల్లికానగర్, మలకాంతపురం, భారతినగర్, పచ్చయప్పన్‌కాలనీ, జీఎస్టీ రోడ్డు, శుభంనగర్, ముత్తమిళ్‌నగర్, మూంగిల్‌యేరి, భవాణి నగర్, పెరుమాళ్‌నగర్, కృష్ణానగర్, దర్గా రోడ్డు, పల్లవగార్డెన్, వైద్యలింగంరోడ్డు, ఈషా పల్లావరం, ఆఫీసర్స్‌లైన్, ఎస్ఎన్‌బీ కాలనీ.

తిరువాన్మియూరు: కావేరి అపార్ట్‌మెంట్, ఎల్‌బీ రోడ్డు, భాష్యంరోడ్డు, ఇందిరానగర్ రెండోవీధి, ఇందిరానగర్ 1,2 అవెన్యూలు, మెయిన్‌రోడ్డు, క్రాస్‌రోడ్డు, వెంకటరత్నంనగర్, టీచర్స్‌కాలనీ, కామరాజర్ అవెన్యూ.

పుళల్: జవహర్‌లాల్‌నగర్, కామరాజర్‌నగర్, పాడియనల్లూరు, బైపాస్‌రోడ్డు తదితర ప్రాంతాల్లో వచ్చే సోమవారం విద్యుత్ ఉండదని టీఎన్ఈబీ అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు.

ప్రభుత్వ బస్సుల్లో ఒకేరోజు 1.78 లక్షల మంది ప్రయాణం

ప్యారీస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్టేట్ ఎక్స్‌ప్రెస్ ట్రాన్స్‌పోర్టు కార్పొరేషన్ (ఎస్ఈటీసీ) రాజధాని నగరం నుండి పలు ప్రాంతాలకు గురువారం నడిపిన 3,250 బస్సుల్లో 1,78,860 మంది ప్రయాణించారు. స్వాతంత్ర్య దినోత్సవం, కృష్ణాష్టమి, ఆదివారం వరుస సెలవులు రావడంతో నగరం, శివారు ప్రాంతాల్లో ప్రజలు సొంతూళ్లకు వెళ్లేందుకు వీలుగా ఎస్ఈటీసీ ప్రత్యేక బస్సులు నడుపుతోంది. ఇందులో గురువారం ఒక్కరోజే 1.78 లక్షల మంది నగరం నుండి సొంతూళ్లకు ప్రయాణమయ్యారు. ఈ నెల 13వ తేదీ నుంచి శుక్రవారం తెల్లవారుజామున 3 గంటలకు వరకు నడిపిన 5,700 బస్సుల్లో 3,13,900 మంది ప్రయాణం చేయడం గమనార్హం.

లక్ష మొక్కలు నాటనున్న జీసీసీ

పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నగరంలో పచ్చదనం పునరుద్ధరించేలా లక్ష మొక్కలు నాటాలని గ్రేటర్ చెన్నై కార్పొరేషన్ (జీసీసీ) నిర్ణయించింది. నగరం, శివారు ప్రాంతాలు గణనీయంగా అభివృద్ధి చెందుతున్నాయి. ముఖ్యంగా, రోడ్ల విస్తరణ, ఫ్లై ఓవర్లు, కొత్త భవనాలు, మెట్రోరైలు తదితర పనుల కారణంగా, పలు ప్రాంతాల్లో ఎన్నో ఏళ్లుగా ఉన్న చెట్లు తొలగిస్తుండడంతో, నగరంలో పచ్చదనం కరువై పర్యావరణానికి ఇబ్బంది కలుగుతోంది. ఈ విషయమై జీసీసీ అధికారులు మాట్లాడుతూ... నగరంలో పచ్చదనం పునరుద్ధరించేలా లక్ష మొక్కలు నాటాలని నిర్ణయించి, పార్కులు, మైదానాలు, రోడ్ల పక్కన, చెరువులు, సముద్రతీరం తదితర ప్రాంతాల్లో 20వేల మొక్కలు నాటామన్నారు. ప్రైవేటు ప్రాంతాల్లో మొక్కలు నాటేందుకు ఆసక్తి ఉన్న వారు కార్పొరేషన్ పార్కుల శాఖను సంప్రదించాలన్నారు. మొక్కలు నాటడంతో పాటు వాటిని సంరక్షించడం ప్రధాన కర్తవ్యంగా చేపట్టినట్లు వారు తెలిపారు.

కుట్రాలంలో స్నానాల నిషేధం

ప్యారీస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ కనుమల్లో భారీ వర్షాల కారణంగా కుట్రాలం జలపాతాల్లో నీటి ప్రవాహం పెరగడంతో పర్యాటకులు స్నానం చేసేందుకు శుక్రవారం నిషేధం విధించారు. దీంతో పెద్ద సంఖ్యలో వెళ్లిన పర్యాటకు నిరాశ చెందారు. కుట్రాలం పర్యాటక ప్రాంతంలో ప్రధాన జలపాతం, ఐదొరివి, పాత కుట్రాలం మొత్తం ఐదు జలపాతాలున్నాయి. వీటిలో నీటి ప్రవాహం శుక్రవారం ఉదయం 11 గంటల నుండి పెరగడంతో స్నానాలు నిషేధిస్తూ జిల్లా యంత్రాంగం ఉత్తర్వులు జారీచేసింది.

సమరయోధుల త్యాగాలను స్మరించుకుందాం

పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు స్మరించుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. పల్లావరం సమీపం పమ్మల్ సూరియమ్మన్ ఆలయ పార్క్‌లో శుక్రవారం పార్క్ స్నేహితుల సంఘం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య వేడుకలు నిర్వహించారు. హోమ్ ఎక్స్‌నోరా సంస్థ అధ్యక్షులు ఇందిరకుమార్ ఆహ్వానం పలికిన వేడుకలకు మాజీ ఏడీఎస్పీ రత్నమణి అధ్యక్షత వహించారు. వేడుకలకు ముఖ్యఅతిథిగా హాజరైన పమ్మల్ శంకర హాస్పిటల్ అధ్యక్షుడు విశ్వనాథన్ జాతీయ పతాకం ఎగురవేశారు. కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త పమ్మల్ లయన్ శరవణ రాజ్, విజయలక్ష్మి, గ్రీన్ సిటీ అరిమా సంఘం అధ్యక్షులు ఎస్.కన్నన్, కార్యదర్శి అన్నామలై సహా పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగ పిల్లలు, ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు.



దివ్యాంగ పిల్లలకు మొక్కలు అందజేస్తున్న నిర్వాహకులు

వైగై ఎక్స్‌ప్రెస్‌కు 48 వసంతాలు

పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణ జిల్లా ప్రయాణికులకు ల్యాండ్ మార్క్ వైగై ఎక్స్‌ప్రెస్ శుక్రవారం 48 వసంతాలు పూర్తిచేసుకుంది. 1977 ఆగస్టు 15న మదురై నుంచి చెన్నైకు పగటి వేళ వైగై ఎక్స్‌ప్రెస్‌ను పరిచయం చేశారు. మదురై నుంచి ఉదయం 6.40 గంటలకు బయల్దేరే వైగై ఎక్స్‌ప్రెస్ మధ్యాహ్నం 2.20 గంటలకు చెన్నై ఎగ్మూర్ చేరుకుంటుంది. చెన్నై ఎగ్మూర్ నుంచి మధ్యాహ్నం 1.50 గంటలకు బయల్దేరి రాత్రి 9.15 గంటలకు మదురై చేరుకుంటుంది. ఈ నేపథ్యంలో, వైగై ఎక్స్‌ప్రెస్ 48వ జన్మదిన వేడుకలను రైలు ప్రయాణికుల సంఘం, రైల్వే ఉద్యోగుల ఆధ్వర్యంలో మదురై రైల్వేస్టేషన్‌లో నాలుగో ప్లాట్‌ఫారంపై ఉన్న వైగై ఎక్స్‌ప్రెస్ ఇంజన్ ముందు కేక్ కట్ చేసి ప్రయాణికులకు మిఠాయిలు పంచిపెట్టారు.



కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకుంటున్న ప్రయాణికుల సంఘ ప్రతినిధులు

ఈసీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ నిరసన

● కొవ్వొత్తులతో ర్యాలీ

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితా సవరణ పేరుతో కేంద్ర ఎన్నికల సంఘం వందల సంఖ్యలో ఓటర్ల పేర్లను తొలగించడాన్ని ఖండిస్తూ గురువారం రాత్రి రాష్ట్ర కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీ జరిగింది. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వానికి సానుకూలంగా ఈసీ వ్యవహరిస్తుండడంపై రాయపేట టవర్‌క్లాక్ కూడలి నుండి టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయం సత్యమూర్తి భవన్ దాకా ర్యాలీ చేశారు. టీఎన్‌సీసీ అధ్యక్షుడు సెల్వపెరుంతగై, మాజీ అధ్యక్షులు కేవీ తంగబాలు, కృష్ణసామి, ఏఐసీసీ కార్యదర్శి డాక్టర్ చెల్లకుమార్, టీఎన్‌సీసీ సమన్వయకర్త పీటర్ ఆల్ఫోన్స్, ఎంపీలు విజయ్‌వసంత్, రాబర్ట్ బ్రూస్ తదితరులు పాల్గొన్నారు.



రాయపేట టవర్‌క్లాక్ కూడలిలో కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేస్తున్న కాంగ్రెస్ నేతలు

మృత్యువులోనూ వీడని బంధం

● ఒకే రోజు దంపతుల మృతి

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఐదు దశాబ్దాల పాటు అన్యోన్యంగా కాపురం చేసిన వృద్ధ దంపతులు ఒకే రోజు మృతి చెందడంతో వారి కుటుంబీకులను శోకతప్తులను కావించింది. ఈరోడ్ వలయక్కార వీధిలో అన్నియప్పన్ (84), పాపమ్మాళ్ (79) అనే దంపతులు నివసిస్తున్నారు. వీరికి ఇద్దరు కుమారులు, నలుగురు కుమార్తెలున్నారు. వీరందరికీ వివాహాలు జరిగి వేర్వేరుగా వుంటున్నారు. 50 యేళ్ళకు పైగా కాపురం చేస్తున్న ఈ జంట ఎక్కడికి వెళ్ళాలన్నా ఒకరిని విడిచి ఒకరు వెళ్లేవారు కాదు. ఈ నేపథ్యంలో పది రోజుల క్రితం అన్నియప్పన్ ఇంటిలో జారిపడి గాయపడ్డాడు. ఆస్పత్రిలో చికిత్స అనంతరం ఇంటిపట్టునే విశ్రాంతి తీసుకుంటూ గురువారం ఉదయం ఆకస్మికంగా మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకుని కుటుంబ సభ్యులు, బంధువులు, స్థానికులతో కలిసి ఆయనకు అంత్యక్రియలను నిర్వహించి అందరూ ఇంటికి తిరిగొచ్చారు. ఆ సమయంలో పాపమ్మాళ్ తన గదిలో మృతి చెంది ఉండటం చూసి దిగ్భ్రాంతి చెందారు. ఐదు దశాబ్దాలకు పైగా కలిసి కాపురం చేసిన ఆ దంపతులు మృత్యువులో వీడలేదంటూ కుటుంబీకులు, బంధువులు విలపించారు.



అన్నియప్పన్, పాపమ్మాళ్ (ఫైల్‌ఫొటో)

స్వాతంత్ర్య సమరయోధుల వారసులకు సత్కారం

ప్యారీస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక హార్బర్ నియోజకవర్గం 56వ వార్డులో శుక్రవారం జరుపుకున్న 79వ స్వాతంత్ర్య దిన వేడుకల్లో సమరయోధుల వారసులను ఘనంగా సత్కరించారు. వార్డు కాంగ్రెస్ అధ్యక్షుడు కలియమూర్తి సారథ్యంలో జరిగిన ఈ వేడుకల్లో ఆలిండియా కాంగ్రెస్ కమిటీ సభ్యుడు, తమిళనాడు కాంగ్రెస్ కమిటీ ప్రధాన కార్యదర్శి ఎన్.రంగభాష్యం ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. సీనియర్ న్యాయవాది, మాజీ కౌన్సిలర్ టి.బోస్, డీఎంకే ప్రాంతీయ కార్యదర్శి చంద్రశేఖర్, జార్జ్, ఫరూక్, బషీర్ అహ్మద్ తదితరుల సమక్షంలో స్వాతంత్ర సమరయోధుల వారసులకు జ్ఞాపికలు అందజేసి ఘనంగా సత్కరించారు.



హార్బర్ నియోజకవర్గంలో స్వాతంత్ర్య సమరయోధుల వారసులతో ఏఐసీసీ సభ్యులు రంగభాష్యం, మాజీ కౌన్సిలర్ బోస్ తదితరులు

అన్నాడీఎంకే ఎంపీ చెల్లించిన అపరాధ సొమ్ము సంక్షేమ పథకాలకు

● రాష్ట్రప్రభుత్వం ప్రకటన

ప్యారీస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): 'ఉంగళుడన్ స్టాలిన్' పథకంలో సీఎం స్టాలిన్ పేరు ఉపయోగించడంపై నిషేధం విధించాలంటూ దాఖలైన కేసును విచారించిన సుప్రీంకోర్టు పిటిషనర్ అన్నాడీఎంకే ఎంపీ సీవీ షణ్ముగంకు రూ.10 లక్షల జరిమానా విధించింది. సీవీ షణ్ముగం ప్రభుత్వానికి చెల్లించిన ఆ సొమ్మును ప్రభుత్వ ఆరోగ్యశాఖ నిర్వహిస్తున్న 'నలంకాక్కుం స్టాలిన్' పథకానికి వినియోగించనున్నట్లు రాష్ట్రప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో తెలిపింది.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సహాయాల పంపిణీ



క్యాన్సర్ బాధితుడికి నిత్యావసర సరుకులు అందజేస్తున్న కృపాసాగర్, డాక్టర్ ఆనందన్ తదితరులు

ప్యారీస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): స్థానిక కొళత్తూరులోని టీచర్స్ కాలనీ రెసిడెన్షియల్ అసోసియేషన్ ప్రాంగణంలో లయన్స్ క్లబ్ ఆఫ్ జీకేడీ మిలీనియం ఆధ్వర్యంలో శుక్రవారం జెండా పండుగ జరిగింది. లయన్ చార్టర్ డాక్టర్ ఎన్.ఆనందన్ అధ్యక్షత వహించగా, అధ్యక్షులు లయన్ కె.కృపాసాగర్ జాతీయ జెండా ఎగురవేసి, ఉచిత వైద్యశిబిరాన్ని ప్రారంభించారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ ప్రకాష్‌కుమార్, కౌన్సిలర్లు ఎస్.నందగోపాల్, ఎం.గుణసుందరి, కమిటీ సభ్యులు, స్థానికులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భాగంగా లయన్స్ క్లబ్ ఆఫ్ జీకేడీ మిలీనియం ఆధ్వర్యంలో క్యాన్సర్ బాధితులు, అంధులకు నిత్యావసర సరుకులు, పారిశుధ్య కార్మికులకు యూనిఫాం, ఆటల పోటీల్లో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు పంపిణీ చేశారు. అనంతరం ఉచిత వైద్యశిబిరంలో కొళత్తూరు సెంథిల్‌నగర్‌లోని చక్రా ఆస్పత్రి వైద్యులు, సిబ్బంది దంత, నేత్ర పరీక్షలు నిర్వహించారు.

తూత్తుకుడి భద్రకాళి ఆలయంలో సుమంగళి పూజ



పూజల్లో పాల్గొన్న ముత్తైదువలు - ప్రత్యేక అలంకరణలో అమ్మవారు

టి.నగర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తూత్తుకుడి చిన్నకన్నుపురం భద్రకాళి అమ్మన్ ఆలయంలో శుక్రవారం ప్రత్యేక అభిషేకం, సుమంగళి పూజలు, మహాదీపారాధన అత్యంత వైభవంగా జరిగింది. ఆ సందర్భంగా ముత్తైదువలకు పసుపు కుంకుమలు, పసుపుతాళ్ళు కానుకగా అందజేశారు. భక్తులందరికీ అన్నదానం చేశారు. ఆలయ నిర్వాహకులు కరుప్పసామి, బాలసుబ్రమణియన్, ఇరుదయరాజ్ తదితరులు ఈ వేడుకలకు విచ్చేసిన భక్తులకు తగు సదుపాయాలు కల్పించారు.

పళ్లిపట్టులో ఇంటింటికీ రేషన్

తిరుత్తణి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా పళ్లిపట్టులో గురువారం సాయంత్రం ఇంటింటికీ రేషన్ సరుకుల పంపిణీ వాహనాన్ని ఆ ప్రాంత డీఎంకే నేతలు ప్రారంభించారు. పళ్లిపట్టు డీఎంకే పట్టణ కార్యదర్శి సీజే సెంథిల్‌కుమార్ ఆధ్వర్యంలో ప్రారంభమైన ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ మురళి, మండల డీఎంకే నిర్వాహకులు చిరంజీవి, జగదీష్, గుణశేఖరన్, యూత్ విభాగ కార్యదర్శి ఖలీల్, రేషన్ డీలర్ లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణిలో స్వాతంత్ర్య దిన వేడుకలు

తిరుత్తణి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మురుగన్ ఆలయంలో శుక్రవారం ఉదయం 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కలెక్టర్ ప్రతాప్ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆడి కృత్తిక ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం ఉదయం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగణంలో కలెక్టర్ భక్తులకు స్వయంగా అన్నం వడ్డించారు. ఈ కార్యక్రమంలో ఆలయ జాయింట్ కమిషనర్ రమణి, ధర్మకర్త శ్రీధరన్, రెవెన్యూ ఆఫీసర్ కనిమొళి, తాహసీల్దార్ మలర్విళి, ఆలయ నిర్వాహకులు సురేష్‌బాబు, మోహన్, ఉషా రవి, ఎం.నాగన్ తదితరుల పాల్గొన్నారు.



భక్తులకు అన్నం వడ్డిస్తున్న కలెక్టర్ ప్రతాప్

అడవి ఏనుగు తరమడంతో గోతిలోకి దిగిన లారీ

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): ఈరోడ్ జిల్లా సత్యమంగళం పులుల అభయారణ్యం సమీపంలో మైసూరు జాతీయ రహదారిలో అడవి ఏనుగు తరుముకురావటంతో అదుపుతప్పిన లారీ రహదారి పక్కనే ఉన్న గోతిలో దిగబడింది. సత్యమంగళం నుండి తాళవాడికి వెళ్లే రహదారిలో తరచూ అడవి ఏనుగులు చెరకులోడు లారీలను అడ్డగిస్తుంటాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం ఉదయం వెనుక టార్పాలిన్ కప్పుకుని ఓ లారీ వస్తుండగా పొదలమాటు నుండి వచ్చిన ఓ ఏనుగు ఆ లారీలో చెరకు గడలుంటాయని భావించి తరిమింది. అడవి ఏనుగు వెంబడించడం గమనించిన డ్రైవర్ లారీని వేగంగా నడపటంతో అదుపుతప్పి రోడ్డు పక్కగా ఉన్న గోతిలోకి దిగింది. అదే సమయంలో లారీ పైనున్న టార్పాలిన్ తొలగటంతో, అందులో చెరకు లేదని గమనించిన ఏనుగు అడవిలోకి వెళ్లింది. లారీ రోడ్డుకు అడ్డంగా నిలిచిపోవడంతో ఆ మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది.



రహదారికి అడ్డంగా నిలిచిన లారీ

విద్యుత్ స్తంభంపై క్రేన్ పడి ఇద్దరు కార్మికుల మృతి

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): నామక్కల్ జిల్లా నాగరాజపురంలో ఓ ప్రైవేటు ఆస్పత్రి వద్ద ఎక్సకవేటర్‌పై నిలిచి పెయింటింగ్ చేస్తున్న ఇద్దరు కార్మికులు విద్యుదాఘాతానికి గురై మృతి చెందారు. ఎరుమపట్టికి చెందిన శివకుమార్ (46), జ్యోతి (45) అనే ఇద్దరు కార్మికులు శుక్రవారం ఉదయం క్రేన్‌పై నిలిచి పెయింట్ చేస్తుండగా జేసీబీ కదలడంతో క్రేన్ విరిగి రోడ్డుపక్కనే ఉన్న విద్యుత్ స్తంభంపై పడింది. అదే సమయంలో ఇద్దరు కార్మికులు క్రేన్ నుండి జారీ విద్యుత్ వైర్లపై పడ్డారు. దీనితో విద్యుదాఘాతానికి గురై ఇరువురూ అక్కడికక్కడే దుర్మరణం చెందారు.

21 కిలోల గుట్కాతో ఇద్దరి అరెస్ట్

ప్యారీస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో నిషేధించిన గుట్కాను ఆటోలో తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేసి వారినుండి 21కిలోల గుట్కా స్వాధీనం చేసుకున్నారు. వానగరంలో గురువారం వాహనాల తనిఖీ చేస్తున్న పోలీసులు ఓ ఆటోను ఆపి తనిఖీ చేశారు. అందులో చట్టవిరుద్ధంగా తరలిస్తున్న 21 కిలోల గుట్కా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని, మహేష్ (45), నాగరాజ్ (38)అనే ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు.

మెట్రో స్తంభం నుంచి జారిపడి కార్మికుడి దుర్మరణం

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): చోళింగనల్లూరు వద్ద జరుగుతున్న మెట్రో రైలు మార్గం నిర్మాణ పనుల్లో ఇద్దరు కార్మికులు స్తంభం పైనుంచి కిందకు జారిపడ్డారు. వీరిలో ఓ కార్మికుడు దుర్మరణం చెందాడు. మరో కార్మికుడు తీవ్ర గాయాలతో ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. చోళింగనల్లూరు సెమ్మొళిసాలై వద్ద మెట్రోరైలు మార్గంలో స్తంభాల నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో శుక్రవారం వేకువజామున ఓ స్తంభంపై నిలిచి పనులు చేస్తున్న జార్ఖండ్ రాష్ట్రానికి చెందిన పిక్కీ కుమార్ (23), సంతోష్ వాక్రా (23) జారి కిందపడ్డారు. తీవ్ర గాయాలతో అపస్మారక స్థితిలో ఉన్న వారిని పెరుంబాక్కంలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. వైద్యులు పరీక్షించి పిక్కీకుమార్ అప్పటికే మృతి చెందినట్లు ప్రకటించారు.

జాతీయ పతాకం నమూనాలో చేసిన కేక్

పెరంబూర్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): రామనాథపురంలో శుక్రవారం నిర్వహించిన పంద్రాగస్టు వేడుకలు చర్చనీయాంశంగా మారాయి. రామనాథపురం సాయుధదళ మైదానంలో నిర్వహించిన 79వ పంద్రాగస్టు వేడుకల్లో జిల్లా కలెక్టర్ సిమ్రన్‌జీత్‌సింగ్ కాలోన్ జాతీయ పతాకం ఎగురవేశారు. అనంతరం దేశ ఐక్యత కాంక్షిస్తూ పావురాలు, మువ్వన్నెల బెలూన్లు ఎగురవేశారు. అనంతరం త్రివర్ణ పతాకంలోని రంగులు, మధ్యలో అశోక చక్రంతో 16 అడుగుల పొడవు, 3.25 అడుగుల వెడల్పుతో రూపొందించిన 79 కిలోల కేక్‌ను కలెక్టర్, ఎస్పీ సతీష్ కట్ చేసి ప్రజలకు అందజేశారు. కాగా, అశోక చక్రంతో కూడిన జాతీయ పతాకం నమూనాలో రూపొందించిన కేక్‌కు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు కట్ చేయడం పట్ల కొంతమంది విమర్శలు గుప్పిస్తున్నారు.



జాతీయ పతాకం నమూనాతో రూపొందించిన కేక్ కట్ చేస్తున్న కలెక్టర్, ఎస్పీ

జిల్లాల్లో పంద్రాగస్టు వేడుకలు

వేలూరు, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): జిల్లావ్యాప్తంగా పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. కోట మైదానంలో నిర్వహించిన వేడుకల్లో జిల్లా కలెక్టర్ సుబ్బులక్ష్మి జాతీయ పతాకం ఎగురవేశారు. అనంతరం నేతాజీ క్రీడా మైదానంలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొని జాతీయ పతాకం ఎగురవేసి, పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. కార్యక్రమంలో 69మంది స్వాతంత్ర్య సమరయోధులను సత్కరించిన కలెక్టర్, ఉత్తమ సేవలు అందించిన పోలీసులు, ఉద్యోగులు మొత్తం 219 మందికి సర్టిఫికెట్లు అందజేసి అభినందించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు నందకుమార్, కార్తికేయన్, ఎస్పీ మయిల్ వాహనన్, డీఆర్వో మాలతి, మేయర్ సుజాత, ఉప మేయర్ సునీల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ద్రావిడ ముస్లిం మున్నేట్ర కళగం...

ద్రావిడ ముస్లిం మున్నేట్ర కళగం ఆధ్వర్యంలో నగరంలో నిర్వహించిన స్వాతంత్ర్య దినో వేడుకల్లో పారిశుధ్య కార్మికుడు మహేంద్రన్ మువ్వన్నెల జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో కళగం రాష్ట్ర అధ్యక్షుడు జీఎస్ ఇక్బాల్, యువజన విభాగం రాష్ట్ర ఆర్గనైజరన్ ముర్తియార్, రాష్ట్ర సెక్రటరీ మహ్మద్‌ఖాన్, జిల్లా అధ్యక్షుడు టిప్పు సుల్తాన్, కౌన్సిలర్ యూసఫ్‌ఖాన్ పాల్గొన్నారు.





సర్టిఫికెట్లు అందుకున్న పోలీసులు, అధికారులతో కలెక్టర్ సుబ్బులక్ష్మి - ప్రతిజ్ఞ చేస్తున్న మాజీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘ సభ్యులు

జిల్లా కోర్టులో...

స్థానిక సత్తువాచేరిలోని ప్రధాన కోర్టు ప్రాంగణంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇళవరసన్ జాతీయ పతాకం ఎగురవేశారు. అలాగే, మాజీ ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు రాజ ప్రతిజ్ఞ చేశారు.

రెడ్‌క్రాస్ సంఘం...

కాట్పాడి రెడ్‌క్రాస్ సంఘం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు జనార్ధనన్ అధ్యక్షత వహించగా, వేలూరు సబ్ కలెక్టర్ సెంథిల్‌కుమార్ పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. కార్యక్రమంలో రెడ్‌క్రాస్ నిర్వాహకులు శ్రీనివాసన్, విజయకుమారి, శివవడివు, పళని తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా పారిశుధ్య కార్మికులకు సబ్ కలెక్టర్ సెంథిల్ కుమార్ కొత్త దుస్తులు అందజేశారు.

మాజీ ఖైదీల సంక్షేమ సంఘం...

మాజీ ఖైదీల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నగరంలో స్వాతంత్ర్య దినోత్సవంలో సంఘ ఉపాధ్యక్షుడు విజయరాఘవులు జాతీయ పతాకం ఎగురవేశారు. కార్యదర్శి జనార్ధనన్, మేనేజర్ అంబాని, వార్డన్ రమేష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలోభాగంగా మాజీ ఖైదీలకు

ప్రైవేటు పాఠశాలల సంఘం...

జిల్లా ప్రైవేటు పాఠశాలల సంఘం ఆధ్వర్యంలో కాట్పాడిలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి రమేష్ బాబు ముఖ్యఅతిథిగా పాల్గొని జాతీయ పతాకం ఎగురవేశారు. కార్యక్రమంలో ఆఫీసు సూపరింటెండెంట్ సెంథిల్, జూనియర్ రెడ్‌క్రాస్ అధ్యక్షుడు జనార్ధనన్ తదితరులు పాల్గొన్నారు.

తిరుత్తణి మున్సిపల్ కార్యాలయంలో ...

తిరుత్తణి, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): తిరువళ్లూరు జిల్లా తిరుత్తణి మున్సిపల్ కార్యాలయంలో 79వ స్వాతంత్ర్య దినాన్ని పురస్కరించుకుని శుక్రవారం ఉదయం మున్సిపల్ ఛైర్పర్సన్ సరస్వతి జెండా ఎగురవేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ ఛైర్మెన్ సమీ రాజ్, ప్రభుత్వ అధికారులు హరిబాబు, దయానిధి, నిషాప్రియన్, నాగరాజ్, రవిచంద్రన్, కౌన్సిల్ సభ్యులు అబ్దుల్లా, విజయ్, సత్య రమేష్, రేవతి, షణ్ముగవల్లి, ఆర్ముగం, నిజామా ముస్తఫా తదితరులు పాల్గొన్నారు.



జెండా వందనం చేస్తున్న తిరుత్తణి మున్సిపల్ ఛైర్పర్సన్ సరస్వతి, ప్రభుత్వ ఉన్నతాధికారులు









జెండా వందనం చేస్తున్న ద్రావిడ ముస్లిం మున్నేట్ర కళగం నిర్వాహకులు - జిల్లా కోర్టులో జాతీయ పతాకం ఎగురవేస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఇళవరసన్ - వెట్టువానమ్ ఎల్లయమ్మన్ ఆలయంలో స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా సహపంక్తి భోజనంలో కలెక్టర్ సుబ్బులక్ష్మి - రెడ్‌క్రాస్ ఆధ్వర్యంలో పారిశుధ్య కార్మికులకు దుస్తులు అందిస్తున్న సబ్ కలెక్టర్ సెంథిల్ కుమార్


స్వతంత్ర్య దినోత్సవం సందర్భంగా జాతీయ పతాకాన్ని ఎగురవేసిన అనంతరం విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న పుదుచ్చేరి యూనివర్సిటీ వైస్ ఛాన్స్‌లర్ డాక్టర్ పి.ప్రకాష్ బాబు


ఆర్పీఎఫ్ గౌరవ వందనం స్వీకరిస్తున్న దక్షిణరైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్


79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మెరీనా తీరంలో వున్న 'వార్ మెమోరియల్' వద్ద అమరవీరులకు నివాళులర్పిస్తున్న దక్షిణ భారత జనరల్ ఆఫీసర్ కమాండింగ్ వి.శ్రీహరి


రిప్పన్ భవనంలో జాతీయ జెండాకు వందనం సమర్పిస్తున్న గ్రేటర్ చెన్నై నగర మేయర్ ప్రియ


ఎగ్మూర్‌లో వున్న చెన్నై మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ కార్యాలయ ప్రాంగణంలో జాతీయ జెండాను ఎగురవేసి, వందనం సమర్పిస్తున్న అథారిటీ కార్యదర్శి కె.ప్రకాష్ తదితరులు




ఐసిఎఫ్ ప్రాంగణంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో వివిధ రకాల విన్యాసాలు ప్రదర్శిస్తున్న ఆర్‌పీఎఫ్ బలగాలు


ఇంటెగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ (ఐసీఎఫ్) ప్రాంగణంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో జెండా వందనం చేస్తున్న ఆ సంస్థ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు


నుంగంబాక్కంలోని మదర్ థెరిస్సా మహిళా కేంద్రంలో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో పాల్గొన్న తమిళనాడు మహిళాభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఆర్వీ సజీవన


చెట్‌పేట్‌లోని తక్కర్ బాబా విద్యాలయంలో జరిగిన స్వాతంత్ర్యదిన వేడుకల్లో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న లయన్స్ క్లబ్ సభ్యులు


తండయార్‌పేటలోని చెన్నై పోర్టు అథారిటీ ప్రాంగణంలో జరిగిన వేడుకల్లో జాతీయ పతాకావిష్కరణ అనంతరం మువ్వెన్నెల బెలూన్లను ఎగురవేస్తున్న అథారిటీ చైర్మన్ సునీల్ పలివాల్

వాడవాడలా మువ్వన్నెల రెపరెపలు

● ఘనంగా 79వ స్వాతంత్ర్య దినోత్సవం



పోలీసుల గౌరవ వందనాన్ని స్వీకరిస్తున్న ముఖ్యమంత్రి స్టాలిన్

చెన్నై, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): దేశ 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా శుక్రవారం వాడవాడలా మువ్వన్నెల పతకం రెపరెపలాడగా దేశభక్తి ఉప్పొంగింది. ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలు, విద్యాలయాలు, ప్రభుత్వ రంగ సంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, రాజకీయ పార్టీలు జాతీయ పతాకాలను ఎగురవేసి, జెండావందనం చేశాయి. దేశ స్వాతంత్ర్యం కోసం పోరాడిన సమరయోధుల వీరగాథలను స్మరించుకుంటూ మిఠాయిలు పెంచిపెట్టారు. మెరీనాతీరంలోని జార్జ్ కోటపై ముఖ్యమంత్రి స్టాలిన్ జాతీయ పతాకాన్ని ఎగురవేయగా, జిల్లా కేంద్రాల్లో, ఇతర ప్రాంతాల్లో మంత్రులు, కలెక్టర్లు జాతీయ పతాకాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా వివిధ రంగాల్లో విశేష కృషి చేసిన వారిని సత్కరించి, అవార్డులను ప్రదానం చేశారు. కాగా స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని రాష్ట్ర మంత్రులు వివిధ ప్రాంతాల్లో సహపంక్తి భోజనంలో పాల్గొన్నారు. అదే విధంగా రాజ్‌భవన్‌లో జరిగిన స్వాతంత్ర్య దినోత్సవంలో గవర్నర్ ఆర్ఎన్ రవి దంపతులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో...

కేంద్ర ప్రభుత్వ కార్యాలయాల్లో 79వ స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కార్యాలయాలు మూడురంగుల్లో విద్యుద్దీపాలు, మువ్వన్నెల జెండాలతో కళకళలాడాయి. వేడుకల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, మార్చ్ ఫాస్ట్ విశేషంగా అలరించాయి. రాజాజీ రోడ్డులోని కస్టమ్ హౌస్‌లో కస్టమ్స్ అండ్ జీఎస్టీ ప్రిన్సిపల్ కమిషనర్ ఏఆర్ఎస్ కుమార్ జాతీయ జెండా ఎగురవేశారు. నుంగంబాక్కం మహాత్మా గాంధీ రోడ్డు సమీపంలోని ఇన్‌కమ్ టాక్స్ కార్యాలయంలో తమిళనాడు, పుదుచ్చేరి చీఫ్ కమిషనర్ ఈఎస్ నాగేంద్ర ప్రసాద్ జాతీయ జెండా ఎగురవేశారు. తండయార్‌పేట హౌసింగ్ కాలనీలోని బాబు జగజ్జీవనరామ్ స్టేడియంలో చెన్నై పోర్ట్ అథారిటీ చైర్‌పర్సన్ సునీల్ పాలియాల్ జాతీయ జెండా ఎగురవేశారు. అన్నాసాలైలోని రీజినల్ పాస్‌పోర్ట్ కార్యాలయంలో పాస్‌పోర్ట్ ఆఫీసర్ ఎస్.విజయకుమార్ జాతీయ జెండా ఎగురవేశారు. పెరంబూర్‌లోని రైల్వే స్టేడియంలో దక్షిణ రైల్వే జనరల్ మేనేజర్ ఆర్ఎన్ సింగ్ జాతీయ జెండా ఎగురవేశారు. ఐసిఎఫ్‌లోని అరుణ్ స్పోర్ట్స్ కాంప్లెక్స్ (ఐసిఎఫ్ స్టేడియం)లో ఇంటగ్రల్ కోచ్ ఫ్యాక్టరీ జనరల్ మేనేజర్ యు.సుబ్బారావు జాతీయ జెండా ఎగురవేశారు. నుంగంబాక్కం హైరోడ్డులోని సెంట్రల్ జీఎస్టీ చెన్నై నార్త్ కమిషనరేట్ కార్యాలయంలో సెంట్రల్ జీఎస్టీ అండ్ జనరల్ ఎక్సైజ్ చీఫ్ కమిషనర్ మదన్ మోహన్ సింగ్ జాతీయ జెండా ఎగురవేశారు.


డీఎండీకే ప్రధాన కార్యాలయంలో జెండా వందనం అనంతరం చిన్నారికి మిఠాయి తినిపిస్తున్న ఆ పార్టీ అధినేత్రి ప్రేమలత


పార్టీ ప్రధాన కార్యాలయంలో జాతీయ పతాకాన్ని ఎగురవేస్తున్న టీఎంసీ అధినేత జీకే వాసన్


చెన్నైలో జరిగిన సహపంక్తి భోజనంలో పాల్గొన్న మంత్రులు


టీఎన్‌సీసీ ప్రధాన కార్యాలయంలో జెండావందనం చేస్తున్న కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు సెల్వపెరుందగై


రాజ్‌భవన్‌లో జరిగిన స్వాతంత్ర్య దిన వేడుకల్లో గవర్నర్ రవి దంపతులు




త్రివిధ దళాల గౌరవవందనాన్ని స్వీకరిస్తున్న సీఎం - ఖాదర్ మొహిద్దీన్‌కు తగసాల్ తమిళర్ అవార్డు అందజేస్తున్న సీఎం స్టాలిన్

తెలుగు లోగిళ్లలో కోలాహలంగా స్వాతంత్ర్య దిన వేడుకలు

ప్యారీస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): భారత 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని రాజధాని నగరం చెన్నైలోని తెలుగు సంఘాలు, విద్యాసంస్థలు శుక్రవారం కోలాహలంగా జరుపుకున్నాయి. తెలుగు లోగిళ్లను రంగవల్లికలు, తోరణాలతో తీర్చిదిద్ది త్రివర్ణ పతాకాన్ని ఆవిష్కరించి, దేశభక్తి గీతాలు ఆలపించారు. వేదిక ప్రాంగణాల్లో సన్మానాలు, విద్యార్థులకు బహుమతుల పంపిణీ, వివిధ సాంస్కృతిక కార్యక్రమాలతో సందడి చేశారు. స్వాతంత్ర్య సమరయోధుల త్యాగాలు స్మరించుకొని నివాళులర్పించారు.

సదరన్ ఇండియా వైశ్య అసోసియేషన్‌లో...


ఎస్ఎల్ సుదర్శనంను మెమెంటోతో సత్కరిస్తున్న సంఘ అధ్యక్షులు అజంతా శంకరరావు

ప్యారీస్ గిడ్డంగి వీధిలోని సదరన్ ఇండియా వైశ్య అసోసియేషన్ కార్యాలయ ప్రాంగణంలో సంఘ అధ్యక్షులు అజంతా డా.కనిగెలుపుల శంకరరావు సారథ్యంలో స్వాతంత్ర్య దిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎస్కేపీడీ చారిటీస్ ట్రస్టీ, ప్రముఖ న్యాయవాది ఎస్ఎల్ సుదర్శనం పాల్గొని జాతీయ జెండా ఆవిష్కరించారు. గౌరవ సంయుక్త కార్యదర్శులు మద్ది నరసింహులు, పువ్వాడ అశోక్‌కుమార్, గౌరవ కోశాధికారి పెసల రమేష్, కాశీవిశ్వనాథం సహా సభ్యులు పాల్గొన్నారు. ఈ వేడుకల్లో ముఖ్యఅతిథి ఎస్ఎల్ సుదర్శనం సత్కరించి జ్ఞాపికతో సత్కరించారు.

అమరజీవి భవనంలో...


జెండా ఆవిష్కరణ చేస్తున్న కమిటీ నిర్వాహకులు

మైలాపూర్‌లోని అమరజీవి పొట్టిశ్రీరాములు స్మారక భవనంలో 79వ స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్‌కేపీడీ మాజీ ట్రస్టీ ఊరా అంజనేయులు హాజరై ఎందరో త్యాగాలకు ప్రతీక ఈ స్వాతంత్రమని, వారి సేవలను ఎప్పటికీ మరువకూడదన్నారు. స్మారక భవనం కమిటీ నిర్వాహకులు ఊరా శశికళ ఆంజనేయులు, జేఎం.నాయుడు దంపతులు, గుడిమెట్ల చెన్నయ్య, ఆచార్య విస్తాలి శంకరరావు తదితరులు పాల్గొని స్వాతంత్ర దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మిఠాయిలు పంపిణీ చేశారు.

ఎంసీటీబీసీలో...


జాతీయ పతాకాన్ని ఆవిష్కరిస్తున్న పాస్టర్ రాజేంద్ర ప్రసాద్

వెప్పేరి హైరోడ్డులోని మద్రాసు సెంటినరీ తెలుగు బాప్టిస్టు చర్చి (ఎంసీటీబీసీ) ప్రాంగణంలో 79వ స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా దేశం కోసం ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. సంఘకాపరి రెవ.డా.ఎస్.రాజేంద్ర ప్రసాద్ జెండా ఆవిష్కరించి ప్రసంగించారు. పాస్టరమ్మ సౌపాటి దానమ్మ, ప్రొటీన్ చైర్మెన్ భాస్కర్, రికార్డింగ్ సెక్రటరీ శేషం.రమేష్, సీనియర్ బోధకులు, సంఘ నిర్వాహకులు, కమిటీ సభ్యులు, మహిళా విభాగం నిర్వాహకులు పాల్గొని జెండా వందనం చేశారు.

చూళైలో....


పంద్రాగస్టు వేడుకల్లో అతిథులు, నిర్వాహకులు

చూళైలోని మహర్షి విద్యామందిర్ సీనియర్ సెకండరీ పాఠశాలలో 79వ స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా ఎవీసీఈఎఫ్ అధ్యక్షుడు కె.రవికుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. గౌరవ కరస్పాండెంట్ టీవీ రామకుమార్, ఎస్‌కేపీడీ ట్రస్టీ సీఆర్.కిషోర్‌బాబు, ప్రిన్సిపాల్ వి.సుబ్రమణ్యం, ట్రస్ట్ మేనేజర్ శ్రీలత, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్న ఈ వేడుకల్లో విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించి సందడి చేశారు.

మద్రాసు మిర్చి వర్తక సంఘంలో...


పంద్రాగస్టు వేడుకల్లో మిర్చి వర్తక సంఘం నిర్వాహకులు

షావుకారుపేట రామకృష్ణ వీధిలోని మద్రాసు మిర్చి వర్తక సంఘంలో పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించారు. అధ్యక్షుడు ఎస్.శివకుమార్, కార్యదర్శి మూర్తి చెన్నకేశవులు, ఉపాధ్యక్షుడు ఎస్కే హిమామ్‌బాషా, ఉప కార్యదర్శి వి.ధనుంజయనాయుడు, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొనగా, వి.రమణయ్య ముఖ్యఅతిథిగా హాజరై త్రివర్ణ పతాకం ఎగురవేసి, సమరయోధుల చిత్రపటాలకు నివాళులర్పించారు. సలహాదారులు ఎం.మాధవయ్య, సభ్యులు ఎస్.బాలసుబ్రమణ్యం, ఎన్.జనార్ధన్, పి.మధుసూధన్, వి.దశయ్య తదితరులు పాల్గొని జెండా వందనం చేశారు.

ఆస్కాలో....


ఆస్కా నిర్వాహకుల జెండా వందనం

టి.నగర్‌లోని ఆంధ్రా సోషల్ అండ్ కల్చరల్ అసోసియేషన్ (ఆస్కా) ఆధ్వర్యంలో 79వ స్వాతంత్ర దినోత్సవం సందర్భంగా అధ్యక్షులు జి.శశిధర్ రెడ్డి స్వాగతోపన్యాసం చేశారు. కార్యదర్శి వడ్లమూడి దిలీప్‌కుమార్ జాతీయ జెండా ఎగురవేసి కీలకోపన్యాసం చేస్తూ, ఎంతోమంది మహనీయులు తమ ప్రాణాలర్పించి దేశమాత దాస్యశృంఖలాలను తెంచి మనకు స్వాతంత్ర్యాన్ని తెచ్చిపెట్టారని కొనియాడారు. సభ్యులు మన్నూరు చలపతి, ఎస్పీ శ్రీనివాస్, జె.మదన్‌గోపాల్‌రావు, సబ్ కమిటీ సభ్యులు గౌతమ్, బృందావనం రవి, ట్రస్టీలు ముండ్రు శ్రీనివాసరావు, వి.బాలాజీ, బీవీఎస్.కోటేశ్వరరావు, ఎస్ఎన్.భిక్షం, వి.ప్రశాంత్, ఆస్కా మాజీ అధ్యక్షుడు మాదాల ఆదిశేషయ్య, మాజీ ఉపాధ్యక్షుడు ఆర్వీ సత్యనారాయణ,మాజీ కోశాధికారి రాం మోహన్‌రావు, మాజీ ట్రస్టీ శ్రీనివాసుల రెడ్డి తదితరులు పాల్గొన్న ఈ కార్యక్రమం సంయుక్త కార్యదర్శి మాదాల వెంకట సుబ్బారావు వందన సమర్పణతో ముగిసింది.

మైలాపూర్ కేసరి స్కూల్...


పంద్రాగస్టు వేడుకల్లో విద్యార్థులతో నిర్వాహకులు, అతిథులు

మైలాపూర్‌లోని కేసరి మహోన్నత పాఠశాలలో స్వాతంత్ర్య దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా తెలుగు తరుణి అధ్యక్షురాలు కాసల రమణి, విశిష్ట అతిథిగా డాక్టర్ చారుమతి, పాఠశాల ఏవో లక్ష్మీ పాల్గొని జాతీయ జెండా ఎగురవేశారు. హెచ్ఎం గీతాంజలి ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, పూర్వవిద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థుల ఉపన్యాసాలు, స్వాతంత్ర సమరయోధుల వేషధారణ, సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి.

టి.నగర్ కేసరి స్కూల్..


ఉపకారవేతనాలు అందుకున్న విద్యార్థులతో అతిథులు, నిర్వాహకులు

టి.నగర్ కేసరి మహోన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు నాగుల గోపాలయ్య అధ్యక్షతన నిర్వహించిన పంద్రాగస్టు వేడుకల్లో ముఖ్యఅతిథిగా లయన్స్ క్లబ్ ఆఫ్ మద్రాస్ ప్రెసిడెన్సీ స్థాపకులు మాదాల ఆదిశేషయ్య పాల్గొన్నారు. లయన్స్ క్లబ్ సభ్యులు ఎం.మనోహర్, గుండపనేని సుబ్రమణ్యం, ఆస్కా సభ్యులు, మాజీ టీటీడీ ఎల్ఏసీ సభ్యులు మన్నూరు చలపతి, టీచర్లు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొని జెండా వందనం చేశారు. 2024-25వ సంవత్సరం పబ్లిక్ పరీక్షలో పాఠశాలస్థాయిలో టెన్త్, ప్లస్‌టూ తరగతుల్లో ప్రతిభ కనపరచిన విద్యార్థులకు రూ.45వేల నగదు బహుమతి అందజేసి అందరికీ శ్రీవారి లడ్డూ ప్రసాదం పంపిణీ చేశారు.

షావుకారుపేటలో...


జెండా పండుగలో బీఆర్ఎస్ పార్టీ నిర్వాహకులు

షావుకారుపేటలోని బీఆర్ఎస్-చెన్నై ఆధ్వర్యంలో నిర్వహించిన 79వ స్వాతంత్ర దినవేడుకల్లో గౌరవాధ్యక్షులు పులి జంపయ్య, అధ్యక్షులు చిత్తలూరు నవీన్‌కుమార్, నిర్వాహకులు దాసరి సింహం, గండ్ల నాగరాజు, తవడబోయిన రమేష్, శాఖాపురం మహేష్, బొంగు శ్రీధర్, మాంపాక సతీష్, మాటూరి వెంకటేష్, మహ్మద్ రఫి, ఆలువాల మల్లయ్య, చిత్తలూరు శ్రీనివాస్, ముప్పిడి పరుశురాములు, గునింగటి రాకేష్, తాళ్లపల్లి వినోద్‌కుమార్, చర్కరాజు తదితరులు పాల్గొని జాతీయ జెండాను ఎగురవేశారు. కార్యక్రమంలో భాగంగా నూతన కమిటీ సభ్యులను పరిచయం చేశారు.

ఎస్‌కేపీడీలో...


విద్యార్థులకు ఉపకారవేతనాలు పంపిణీ చేస్తున్న ఎస్‌కేపీడీ ట్రస్టీలు

జార్జిటౌన్ ఆదియప్పనాయకన్ వీధిలోని శ్రీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం (ఎస్‌కేపీడీ) ప్రాంగణంలో 79వ స్వాతంత్ర్య దిన వేడుకలను కోలాహలంగా నిర్వహించారు. కన్యకా పరమేశ్వరి మహిళా కళాశాల, కేటీసీటీ మహోన్నత, ప్రాథమిక, ఎస్‌కేపీడీ బాలుర మహోన్నత, ప్రాథమిక పాఠశాలల విద్యార్థినీ, విద్యార్థులు, టీచర్లు పాల్గొని, దేశభక్తి గీతాలు ఆలపించి, సాంస్కృతిక కార్యక్రమాలతో ఆకట్టుకున్నారు. అధిక మార్కులు సాధించిన 200 మంది విద్యార్థులకు రూ.10లక్షల విలువైన ఉపకారవేతనాలు పంపిణీ చేసి ఆశీర్వదించారు. ఎస్‌కేపీడీ ట్రస్టీలు ఊటుకూరు శరత్‌కుమార్, ఎస్ఎల్ సుదర్శనం, టీవీ.రామకుమార్, సీఆర్.కిషోర్ బాబు, టి.బద్రీనాథ్, అడ్వయిజర్ డా.జేపీ రావు, కార్యదర్శి ఎం.కిషోర్‌కుమార్, ప్రొఫెసర్లు, టీచర్లు, విద్యార్థులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. ముందుగా ప్రాంగణంలో జాతీయ జెండా ఎగురవేసి జెండా వందనం చేశారు. ఈ సందర్భంగా వేదికపై విద్యార్థులు దేశభక్తిగీతాలు ఆలపించారు.

చిదంబరం ఆలయంలో పంద్రాగస్టు వేడుకలు

ప్యారీస్, ఆగస్టు 15 (ఆంధ్రజ్యోతి): కడలూరు జిల్లా చిదంబరం నటరాజస్వామి ఆలయంలో పంద్రాగస్టు వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం 7 గంటలకు దీక్షితార్లు ఆలయ ప్రాంగణంలో జాతీయ జెండాకు ప్రత్యేక పూజలు నిర్వహించి తూర్పు గోపురంపై ఎగురవేసి జెండా వందనం చేశారు. స్వాగంత్ర్య దినోత్సవం సందర్భంగా తిరుసభలో కొలువైన శివకామసుందరీ సమేత నటరాజమూర్తికి ప్రత్యేక అభిషేకాలు, దీపారాధన చేశారు.


పంద్రాగస్టు వేడుకల్లో దీక్షితార్లు